

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : గురువారం 6.23(సాయంత్రం)

సెహరీ : శుక్రవారం 4.59 (ఉదయం)

అడవే మన అండ

పర్యావరణంలో అడవులే ప్రధానం. అడవులు ప్రాణకోటికి జీవనాధారమేగాక పర్యావరణ పరిరక్షణకు, సమతౌల్యానికి తోడ్పడతాయి. జాతీయ అటవీ విధానం ప్రకారం భూవిస్తీర్ణంలో 33శాతం అడవులు ఉండాలి. ప్రపంచ వ్యాప్తంగా 31శాతం అటవీ విస్తీర్ణం వుండగా మన దేశంలో మాత్రం కేవలం 23శాతం మాత్రమే అడవులు ఉన్నాయి. దీంతో ఇప్పటికే అనేక ప్రకృతి వైపరీత్యాలతో జనం అతలాకుతలమవుతున్నారు. భారత అటవీ శాఖ అనేక విధాలుగా కసరత్తు చేస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఫలితాలు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. ఈ సమస్య చాలా దేశాల్లో ఉన్నది. అందుకే అటవీ రక్షణకు ప్రపంచదేశాలన్నీ కలిసి అనేక చర్యలు తీసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే మార్చి 21ని ప్రపంచ అటవీ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.


- ఆత్మకూరు

- జన చైతన్యంతోనే అడవుల అభివృద్ధి సాధ్యం
- భూమిపై 31శాతం మాత్రమే అటవీ విస్తీర్ణం
- మన జిల్లాలో కేవలం 21 శాతానికే పరిమితమైన అడవులు
- అడవికి అండ ఆదివాసులే
- నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం



అడవులు సమృద్ధిగా వుంటే సకాలంలో వర్షాలు కురుస్తాయి. సాగు, తాగు నీటి అవసరాలు తీరతాయి. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితే పరోక్షంగా అనేక రంగాలకు ప్రయోజనం చేకూరుతుంది. వాతావరణ కాలుష్యం నియంత్రణలో ఉంటుంది. భూమి వేడెక్కకపోతే భూగర్భజలాలు పెరుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా అడవుల్లో కురిసే వర్షాల ద్వారా మూడో వంతు ప్రపంచ జనాభాకు దాహం తీరుతోంది. అందువల్ల అడవులు అభివృద్ధి మొత్తంగ పర్యావరణానికి కీలకం.

జన చైతన్యంతోనే అడవుల అభివృద్ధి సాధ్యం



మనిషి స్వార్థ ప్రయోజనాల కోసం అడవులను నరికేస్తున్నారు. అడవుల సంరక్షణపై ప్రజల్లో చైతన్యం వస్తే.. తప్ప పర్యావరణానికి భరోసా ఉండదు. ఇందుకోసం ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు పెంచాలి. ప్రతి గ్రామంలో, పట్టణంలో ఉన్న భూవిస్తీర్ణానికి తగ్గట్లుగా 33శాతం అడవులు, లేక చెట్లు ఉండే విధంగా ప్రణాళిక రూపొందించుకుని మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలి. అటవీ సమీప గ్రామాల వారు అడవిని నాశనం చేస్తూ.. సాగుభూమిగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ పద్ధతులను వదిలిపెట్టి అటవీ సంరక్షణకు తోడ్పడాలి. అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు అన్న విషయాన్ని గుర్తించుకుని అడవికి నిప్పు పెట్టకుండా జాగ్రత్తగా వ్యవహరించాలి.

ఆదివాసులే అండ

వందల ఏళ్ల నుంచే అడవి తల్లికి ఆదివాసీలే అండగా నిలుస్తున్నారు. అటవీ శాఖ ఆవిర్భావానికి మునుపే అటవీ రక్షణలో గిరిజనులు అడవిని కాపాడుతున్నారు. నల్లమల అడవుల్లోని వృక్షజాతులు, వన్యప్రాణుల గురించి పూర్తిగా చెంచులకు అవగాహన వుండేది. అడవుల్లో ఎక్కడెక్కడ నీటినిల్వలు ఉన్నాయి, ఏఏ ప్రాంతాల్లో క్రూరమృగాలు సంచరిస్తాయి, అరుదైన వృక్షజాతులేంటి అనే విషయాలు చెంచులు సులభంగా గుర్తిస్తారు. అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగించే గిరిజనులు అడవి తల్లికి కంటికి రెప్పలా కాపాడుకుంటారు. అయితే ప్రస్తుతం అటవీరక్షణలో చెంచులకు అటవీశాఖ సరైన ప్రాముఖ్యత కల్పించడం లేదు.



జిల్లాలో 19శాతమే అడవుల విస్తీర్ణం

భూ విస్తీర్ణంలో 33 శాతం అడవులు ఉంటేనే మానవ మనుగడకు విఘాతం ఉండదని నిపుణులు చెబుతున్నారు. అయితే మన ఉమ్మడి కర్నూలు జిల్లాలో మాత్రం 19శాతం మాత్రమే అడవుల విస్తీర్ణం వున్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 17,658 చ.కి.మీల విస్తీర్ణం వుండగా అందులో 3446చ.కిమీల విస్తీర్ణంలో మాత్రమే అడవులు విస్తరించాయి. అందులో 1228.11చ.కిమీల అటవీ విస్తీర్ణం ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ పరిధిలో ఉండటం గమనార్హం. కాగా నల్లమలలోని నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వు ఫారెస్ట్ దేశంలోనే అతి పెద్ద టైగర్ రిజర్వు ఫారెస్ట్‌గా పేరుగాంచింది. దీంతో పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా నిలిచిన పెద్దపులుల సంరక్షణ కూడా నల్లమలలో సజావుగా సాగుతోంది. ఇదిలావుంటే నల్లమల అడవులు విస్తరించిన కర్నూలు జిల్లాలోనే పరిస్థితి ఇలా ఉంటే అడవుల విస్తీర్ణం అంతగా లేని అనంతపురం లాంటి కరువు జిల్లాల పరిస్థితి ఏ విధంగా వుందో అర్థం చేసుకోవచ్చు.

అడవుల సంరక్షణకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలి

అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. అడవుల వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి. ప్రజల్లో చైతన్యం కలిగినప్పుడే అడవులకు రక్షణ ఉంటుంది. దీనికి అటవీశాఖ తరపున గ్రామీణ ప్రాంతాల్లో కళాజాత కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

- పట్టాభి, ఆత్మకూరు రేంజ్ ఆఫీసర్

మిర్చి ధర పతనం

- గత నెలలో రూ.30 వేలకు పైగా పెరిగిన ధర
- ఇప్పుడు సగానికి పడిపోయిందని రైతుల ఆవేదన



కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 20: ఉమ్మడి కర్నూలు జిల్లాలో మిర్చి పంట రైతులకు కన్నీళ్లు తెప్పిస్తోంది. గత సంవత్సరం రూ.40 వేలకు పైగానే ధర పలికింది. ఈ సంవత్సరం ప్రారంభంలో రూ.30 వేలకు పైగానే ధర పలికింది. అధిక డిమాండ్, ధర ఉండే బ్యాడిగి, డబ్బీరం రకం మిర్చిని ఈసారి రైతులు బోర్లు, బావులు, కేసీ కెనాల్, ఎల్లెల్సీతో పాటు హంద్రీనీవా కాలువ, గాజులదిన్నె జలాశయం ఆయకట్టు ప్రాంతంలో దాదాపు 60వేల ఎకరాల్లో సాగు చేశారు. అయినా నీరు చాలక ట్యాంకర్ల ద్వారా నీరు అందించి పంటను కాపాడుకున్నారు. ఈసారి వర్షాభావం వల్ల పంట సాగు విస్తీర్ణం తగ్గిందని, ధర పెరుగుతుందని రైతులు అంచనా వేశారు. అయితే తెగుళ్ల కారణంగా దిగుబడి భారీగా తగ్గింది. ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దాకా దిగుబడి రావాల్సి ఉండగా.. ఐదారు క్వింటాళ్లకే పరిమితమైంది. చేతికందిన పంటకైనా గిట్టుబాటు ధర అందుతుందేమోనని రైతులు ఆశ పెట్టుకున్నారు. అయితే ఈ నెల ప్రారంభం నుంచి కర్నూలు మార్కెట్ యార్డులో ఎండుమిర్చి ధర నానాటికి తగ్గిపోతూ వస్తోంది. బుధవారం కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటం ఎండు మిర్చి ధర రూ.17వేలకు తగ్గిపోయింది. మిర్చి వ్యాపారులు సిండికేటై తమను ముంచుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని మొర పెట్టుకుంటున్నారు.

1,157 మంది విద్యార్థులు గైర్హాజరు

కొనసాగుతున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 20: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 1,157 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. 134 పరీక్షా కేంద్రాల్లో 24,986 మంది విద్యార్థులకు గాను 23,825 మంది హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 10 ఫ్లాయింగ్ స్క్వాడ్ బృందాలు 64 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా రాష్ట్ర పరిశీలకులు ఆర్ఎస్ గంగా భవాని ఆరు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. సమస్యాత్మక కేంద్రాలలో సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి పరీక్షలు సజావుగా నిర్వహించినట్లు డీఈఓ తెలిపారు.



అభ్యర్థుల ఖర్చులపై నిఘా

- కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), మార్చి 20: రానున్న సాధారణ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు చేసే ఖర్చులపై ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా ఎన్నికల అధికారి/ కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రత్యేక బృందాలకు ఎన్నికల శిక్షణా తరగతులు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎన్నికల వ్యయ నోడల్ అధికారి వెంకటసుబ్బయ్య, ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి తమ ఎన్నికల ప్రచారానికి ఎన్నికల సంఘం సూచించిన మేరకే ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఖర్చు చేసే వ్యయాన్ని లెక్కకట్టి ఏరోజుకు ఆరోజు నివేదికలను ఇవ్వాలని సూచించారు. బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు, వాహనాలు, ఆహార పదార్థాల ఖర్చులతో సహా లెక్కించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్‌కమిటీ నుంచి వచ్చిన ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌కు సంబంధించివాటిని కూడా లెక్క కట్టి అభ్యర్థుల ఖాతాలో నమోదు చేయాలన్నారు. ప్రత్యేక బృందాలు, వీడియో సర్వేలైన్ టీంలు చురుకుగా పనిచేయాల్సి ఉంటుందని కలెక్టర్ హెచ్చరించారు.

రాష్ట్రాన్ని ముంచేసిన జగన్

- రెండు నెలల్లో వైసీపీ కనుమరుగు
- మాజీ ఎమ్మెల్యే బీసీ ఫైర్



కోవెలకుంట్లలో మహిళలతో మాట్లాడుతున్న బీసీ జనార్దన్ రెడ్డి

కోవెలకుంట్ల, మార్చి 20: ఒక్క చాన్స్ పేరుతో గద్దెనెక్కిన సీఎం జగన్ గడిచిన ఐదేళ్లల్లో రాష్ట్రాన్ని ముంచేశాడని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దుర్మార్గ పాలనకు రెండు నెలల్లో తెరపడుతుందని ఆయన అన్నారు. కోవెలకుంట్ల పట్టణంలో బుధవారం ఆయన పర్యటించి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. జగన్ పాలనపై ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. జగన్‌ను ఏ ఒక్కరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం రూ.11 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసిందన్నారు. అప్పులు పుట్టకుంటే ఉద్యోగులకు జీతాలిచ్చే పరిస్థితి కూడా లేని స్థితికి రాష్ట్రాన్ని జగన్ దిగజార్చాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసారి సైలెంట్ ఓటింగ్ జరగనుందని, టీడీపీ విజయం ఖాయమన్నారు. కోవెలకుంట్ల పట్టణంలో తాగునీటి సమస్యను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా సమస్యలను పరిష్కరించని వైసీపీ నేతలు ఏ మొహం పెట్టుకుని ఓట్లను అభ్యర్థించేందుకు వస్తారన్నారు. రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని, ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తామని బీసీ జనార్దన్ రెడ్డి హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీవీ ప్రసాద్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, మద్దిలేటి, సుబ్బారెడ్డి, రాజశేఖర్, అమర్‌నాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను పట్టించుకోని ప్రభుత్వం



మాట్లాడుతున్న వెంగళరెడ్డి

నంద్యాల (నూనెపల్లె), మార్చి 20: రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లు, సమస్యలను పరిష్కరించడంలో జగన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏపీ ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం నంద్యాలలోని ఏపీ ఎన్జీఓ కార్యాలయంలో ఉద్యోగులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వెంగళరెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని, ఐఆర్ ప్రకటించకపోవడం దారుణమన్నారు. ఈ సందరంగా రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంపికైన దస్తగిరిరెడ్డిని సంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మణిశేఖర్‌రెడ్డి, హుసేన్‌రెడ్డి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. బసవేశ్వరుడి రథోత్సవం



బసవేశ్వరస్వామి రథోత్సవం

కోసిగి, మార్చి 20: కోసిగి మండలంలోని జంపాపురం గ్రామంలో కొలువైన బసవేశ్వరస్వామి రథోత్సవం బుధవారం కన్నులపండువగా సాగింది. ఉదయం నుంచి బసవేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, మంగళహారతి, ఆకుపూజతో పాటు వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. సాయంత్రం బసవేశ్వరస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేలాదిమంది హాజరైన భక్తులు స్వామి వారి రథాన్ని లాగి తమ మొక్కులు తీర్చుకున్నారు.

మోహన నారసింహుడు

- మోహినీ అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీవారు
- అహోబిలంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



శేషవాహనంపై విహరిస్తున్న ప్రహ్లాదవరదస్వామి

నంద్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనృసింహస్వామి మోహినీ అలంకరణలో భక్తులను కనువిందు చేశారు. మైమరపించే సోయగాలు, వివిధ రకాల స్వర్ణాభరణాలు, సుగంధ పుష్పాలతో మోహనరూపుడైన శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అహోబిలం లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో ఆరో రోజు బుధవారం జ్వాలా నరసింహస్వామిని వేదపండితులు మోహినీ రూపంలో అలంకరించారు. ముందుగా ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామికి ఉత్సవం, అభిషేకం కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి శ్రీదేవి,భూదేవి సమేత నరసింహస్వామి శరభ వాహనంపై విహరించారు. అదేవిధంగా దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరదస్వామి ఉదయం శేషవాహనంపై దర్శనమివ్వగా రాత్రి చంద్రప్రభ వాహనంపై తిరువీధుల్లో విహరించారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రామ్‌కో సిమెంటు కంపెనీ యాజమాన్యం రూ.6 లక్షలు విలువ చేసే గేట్లను ఓఎస్‌డీ శివప్రసాదరావు, పీఆర్వో సేతురామన్‌కు బుధవారం అందజేశారు.



ఎగువ అహోబిలంలో మోహినీ అలంకారంలో జ్వాలా నరసింహస్వామి



సాయమా? బిచ్చమా?

వైసీపీ ప్రభుత్వానికి రైతులపట్ల బాధ్యత లేదని పదే పదే రుజువవుతోంది. రైతుల కోసమే తమ ప్రభుత్వం ఉన్నదని బైటికి తీయని మాటలు చెబుతూ వంచిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2023 ఖరీఫ్‌లో ఉమ్మడి జిల్లాలోని 54 మండలాల్లో కరువు వల్ల రైతులు భారీగా నష్టపోయారు. అందరినీ ఆదుకోవాల్సిన ప్రభుత్వం కేవలం 30 మండలాలను మాత్రమే కరువు జాబితాలో చేర్చింది. దీని కోసం అన్యాయమైన నిబంధనలు తీసుకొచ్చింది. సుమారు నాలుగు లక్షల మంది రైతులు కరువు వల్ల నష్టపోతే నిబంధనల సాకుతో కేవలం 3.75 లక్షల మందికి బిచ్చంలా పరిహారం విదిల్చి చేతులు దులుపుకుంది. మరో 3 లక్షల మందికిపైగా రైతులను అనర్హుల జాబితాలో చేర్చింది. నష్టపోయిన రైతులు పరిహారానికి అనర్హులు కావడం ఏమిటనే విమర్శలను ప్రభుత్వం పట్టించుకోలేదు. 2023-24 రబీ సీజన్‌లో కూడా అన్ని మండలాల్లో కరువు వల్ల పంటలు దెబ్బతిన్నాయి. వైసీపీ ప్రభుత్వానికి రైతుల గోడు పట్టలేదు. కేవలం 31 మండలాల్లోనే కరువు ఉందని తీర్మానించింది. ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసిన సమయంలో వైఎస్ జగన్ 2018 ఖరీఫ్, 2018-19 రబీ పంట నష్టానికి పరిహారం ఇస్తానని హామీ ఇచ్చారు. అది కూడా అతీగతి లేదు.

కర్నూలు అగ్రికల్చర్

- నిబంధనల సాకుతో సగానికిపైగా రైతులకు అందని పంట నష్ట పరిహారం
- 2018 ఖరీఫ్, 2018-19 రబీ పంట నష్టానికి ఇప్పటికీ అందని సాయం
- కేంద్రం పంపిన నిధులను దారి మళ్లించిన జగన్ ప్రభుత్వం
- 2023 ఖరీఫ్, 2023-24 రబీలో కరువు మండలాల ప్రకటనలో అన్యాయం
- నిబంధనల పేరుతో భారీగా అనర్హుల జాబితాలోకి



ప్రజలకు ఇచ్చిన హామీలను ఉల్లంఘించడంలో వైసీపీ ప్రభుత్వానికి సాటి లేదు. కరువుబారిన పడిన రైతులందరినీ ఆదుకుంటానని ప్రగల్భాలు పలకడం, వాటిని అమలు చేయకపోవడంలో సీఎం జగన్‌కు ఏపాటి చిత్తశుద్ధి ఉన్నదీ రుజువు అవుతోంది టీడీపీ ఆధికారంలో ఉన్న కాలంలో 2018 ఖరీఫ్‌తో పాటు, 2018-19 రబీలో ఉమ్మడి జిల్లాలో దాదాపు 6.11 లక్షల మంది రైతులు పంట నష్టపోయారు. నాటి ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని మండలాలన్నీ కరువు బారిన పడ్డాయని గుర్తించింది. రాష్ట్ర ప్రభుత్వ నివేదిక మేరకు కేంద్ర ప్రభుత్వం 2019లో రూ.500 కోట్ల కరువు సాయాన్ని విడుదల చేసింది. 2019 జగన్ ప్రతిపక్ష నేతగా చేపట్టిన పాదయాత్రలో 2018 ఖరీఫ్, 2018-19 రబీ పంట నష్టపరిహారాన్ని రైతులకు అందిస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్లు కావస్తున్నా ఆ మాటను నిలబెట్టుకోలేదు. పైగా కేంద్రం విడుదల చేసిన పరిహారాన్ని పక్కదారి పట్టించింది. తన పాలనాకాలంలో కరువుబారిన పడ్డ రైతుల్లో సగానికిపైగా అనర్హులని తేల్చి వారిని కష్టాల్లో తోసేసింది.

● అర్థం పర్థం లేని నిబంధనలు

ప్రభుత్వం అర్థం పర్థం లేని నిబంధనలు అమలు చేయడం వల్ల పంట నష్టానికి గురైన రైతులు అనర్హుల జాబితాలో చేరిపోతున్నారు. 2018 ఖరీఫ్‌లో, 2018-19 రబీ సీజన్‌లో తీవ్ర వర్షాభావం వల్ల పంటలు దెబ్బతిన్నాయి. అయితే రెండు హెక్టార్లకు మాత్రమే నష్టపరిహారాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో దాదాపు రూ.100 కోట్ల పంట నష్టపరిహారానికి అర్హులైన లక్ష మంది రైతులు అనర్హుల జాబితాలో చేరిపోయారు. అదే విధంగా 2023-24 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు దాదాపు 50 శాతం మంది అనర్హుల జాబితాలో చేరారు. ఉద్యాన పంటలు 50 శాతానికి పైగా నష్టపోతేనే కరువు సాయం అందుతుందనే నిబంధన అమలు చేయడం వల్ల 50 శాతానికి లోబడి పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదు. ప్రభుత్వం తమను కేవలం బిక్షగాళ్లుగా గుర్తిస్తుందని, అరకొర పరిహారం కొందరికి ఇచ్చి చేతులు దులుపుకుంటోందని రైతులు ఆగ్రహంతో ఉన్నారు. ఐదేళ్ల కింద కేంద్రం నిధులు పంపినా.. తమకు పరిహారాన్ని ఇవ్వలేదని విమర్శిస్తున్నారని 2018-19లో పంట నష్టానికి గురైన రైతులు ఆరోపిస్తున్నారు.

కేంద్రం ఇచ్చినా.. దారి మళ్లించిన జగన్

2018 ఖరీఫ్‌లో 40 మండలాలు, 2018-19 రబీ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 33 మండలాల్లో వర్షాభావం వల్ల తీవ్రంగా నష్టపోయిన 6.11 లక్షల మంది రైతులకు రూ.659.40 కోట్ల నష్టపరిహారాన్ని అందించాల్సి ఉందని అప్పటి కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక పంపారు. నాటి టీడీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో తన వంతుగా రూ.500 కోట్ల పరిహారాన్ని ఉమ్మడి కర్నూలు జిల్లాకు అందజేసింది 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించింది.

2023-24 కరువు పరిహారంలోనూ అన్యాయమే

2023 ఖరీఫ్, 2023-24 రబీ సీజన్‌లలో తీవ్ర వర్షాభావం ఉమ్మడి కర్నూలు జిల్లాను అతలాకుతలం చేసింది. ఖరీఫ్‌లో సాగు చేసిన 6 లక్షల హెక్టార్లు, అదే విధంగా రబీలో సాగు చేసిన 3 లక్షల హెక్టార్లలో పత్తి, వేరుశనగ, మిరప, ఉల్లి, మొక్కజొన్న తదితర పంటలన్నీ వర్షాలు లేక మాడిపోయాయి. తీవ్ర కరువును కళ్లార చూసిన అధికారులు ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కేవలం 30 మండలాల్లో మాత్రమే కరువు నెలకొన్నట్లుగా నివేదికలు పంపారు. మిగిలిన 24 మండలాల రైతులు తమ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. అయినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. కర్నూలు జిల్లాలో కర్నూలు రూరల్, తుగ్గలి, నంద్యాల జిల్లాలో డోన్, ప్యాపిలి మండలాల్లో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉండటంతో ఆ మండలాల రైతులు రోడ్డెక్కి ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఆ మండలాలను కూడా కరువు జాబితాలో చేర్చాలని రెండు జిల్లాల కలెక్టర్లు పంపిన జాబితాలను ప్రభుత్వం పక్కన పెట్టేసింది. 2023-24 సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో 6.50 లక్షల మంది రైతులు పంట నష్టానికి గురైతే.. ప్రభుత్వం మాత్రం కేవలం 3.20 లక్షల మంది రైతులకు మాత్రమే కరువు సాయాన్ని అందించింది. నిబంధనల పేరుతో మిగిలిన 3 లక్షల మంది రైతులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ప్రస్తుతం 2024 రబీ సీజన్‌లో కూడా కరువు వల్ల రైతులు నష్టపోయారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 54 మండలాల్లో తీవ్రంగా కరువు పరిస్థితులు వెంటాడినా కేవలం 31 మండలాల్లోనే కరువు నెలకొన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. కర్నూలు జిల్లాలో కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, కోడుమూరు, కల్లూరు, ఓర్వకల్లు, గూడూరు, ఆదోని, మంత్రాలయం ఆలూరు, చిప్పగిరి, ఆస్పరి హొళగుంద, హాలహర్వి, పత్తికొండ తుగ్గలి, మద్దికెర, వెల్దుర్తి, సీ. బెళగల్ మండలాలను కరువు నెలకొన్నట్లుగా రెండు రోజుల క్రితం ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డ, గోస్పాడు, గడివేముల, బనగానపల్లె, ఉయ్యాలవాడ, సంజామల, అవుకు, నందికొట్కూరు, మిడ్తూరు, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, డొర్నిపాడు, నంద్యాల మండలాలో మాత్రమే కరువు ఉందని గుర్తించారు. మిగిలిన ఉమ్మడి జిల్లాలో 23 మండలాల్లో కరువు తాండవిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు.

రైతులందరికీ నష్టపరిహారం అందిస్తాం

ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టానికి గురైన రైతులందరికీ నిబంధనల మేరకు ఇన్‌పుట్ సబ్సిడీ (నష్టపరిహారం) అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో ఏ మాత్రం నిర్లక్ష్యం చూపలేదు. గత ఖరీఫ్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 3.75 లక్షల మంది రైతులు పంట నష్టానికి గురైతే.. వారికి రూ.460.47 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని వారి బ్యాంకు ఖాతాలకు ఇటీవలే జమ చేశాం. ప్రస్తుత రబీ సీజన్‌లోనూ వర్షాభావం వల్ల దెబ్బతిన్న పంటలను గుర్తించాం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 31 మండలాల్లో కరువు నెలకొన్నట్లు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు అందించిన నివేదికల మేరకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

- వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి

ఆటోను ఢీకొన్న కారు.. ఐదుగురికి తీవ్ర గాయాలు



బోల్తాపడిన ఆటో

ఓర్వకల్లు, మార్చి 20: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై ఓర్వకల్లు ఎంపీడీవో కార్యాలయం సమీపాన ఉన్న జగనన్న కాలనీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. కర్నూలు నుంచి నంద్యాల వెళ్తున్న ఆటోను వెనుకవైపు నుంచి కారు ఆటోను ఢీకొనడంతో ఆటో 20 అడుగుల లోయలో పడిపోయింది. అందులో ప్రయాణిస్తున్న రాజు, రామప్ప, గంగమ్మ, కేశమ్మ, సామన్నలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే పెట్రోలింగ్ వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయింది. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ రాజారెడ్డి సందర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సలకలకొండ పొలాల్లో చిరుత మృతి

ఆదోని రూరల్, మార్చి 20 : ఆదోని మండల పరిధిలోని సలకలకొండ పొలాల్లో మృతి చెందిన చిరుతను బుధవారం స్థానికులు గుర్తించారు. ఫారెస్టు అధికారి తేజస్వి, తాలుక ఎస్.ఐ ఎర్రిస్వామి సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతి చెందిన చిరుతకు ఎలాంటి గాయాలు లేవని, నోటిలో, ముక్కు ద్వారా రక్తస్రావం జరిగిందని, పోస్టుమార్టం చేస్తేగాని, మృతికి గల కారణాలు చెప్పలేమని ఫారెస్టు అధికారులు తెలిపారు. అయితే గత కొన్ని రోజులుగా బసరకోడ, సలకలకొండ, ఆలసందగుత్తి పొలాల్లో, కొండల్లో చిరుత సంచరిస్తుందని గ్రామస్థులు, రైతులు అధికారులకు సమాచారం అందించారు. చిరుత దాడిలో పలుమార్లు పశువులు, మేకలు కూడ మృతి చెందాయి. ఎవరైనా విష ప్రయోగం చేయడం వల్లనే చిరుత మృతి చెందిందా? లేక వేటగాళ్ల దాడికి బలైందా? అనేది తెలియాల్సి ఉంది.



మృతి చెందిన చిరుత

మాధవరం స్టీల్ ఫ్యాక్టరీలో ఒకరి మృతి

మంత్రాలయం, మార్చి 20: మంత్రాలయం మండలంలోని మాధవరం స్టీల్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న చోడీ గంగ (22) అనే యువకుడు మృతి చెందాడు. మృతుడు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుక్మా జిల్లాకు చెందిన వ్యక్తిగా మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. ఐరన్ ఫ్యాక్టరీలో కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్న చోడీ గంగపై ఐరన్ ముద్ద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే యాజమాన్యం మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమ్మితం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నలుగురికి గాయాలు

గూడూరు, మార్చి 20: కె నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. మంగళవారం అర్థరాత్రి ఈ ఘటన జరిగింది. కె నాగలాపురం నుండి కర్నూలు వైపు ఇన్నోవా వెహికిల్ వెళ్తుండగా, కర్నూలు నుండి కైరవాడి వైపు వెళ్తున్న ఐచర్ వాహనం ఎదురుగా వచ్చి ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఇన్నోవాలో ప్రయాణిస్తున్న చంద్రమోహన్ రెడ్డి మృతి చెందగా, మరో నలుగురికి గాయాలు అయ్యాయి. ప్రమాద సంఘటన తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని గాయాలైన నలుగురిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి

పెద్దకడుబూరు, మార్చి 20: రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మేకడోణ గ్రామ సమీపంలో బుధవారం జరిగింది. ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన బోయ బసవరాజు ద్విచక్ర వాహనంపై పెద్దకడబూరు మండలం రంగాపురం గ్రామానికి వెళ్లి తిరిగి పెద్దతుబంళం బయల్దేరాడు. బసలదొడ్డి గ్రామానికి చెందిన వీరేష్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా మేకడోణ గ్రామ సమీపాన రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పెద్దతుంబళం గ్రామానికి చెందిన బసవరాజు (32) తలకు బలమైన గాయమైంది. వీరేష్ కాలుకు తీవ్రగాయాలయ్యాయి. వీరిద్దరిని ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో బసవరాజు మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇమాం హుసేన్‌ది రాజకీయ హత్య కాదు..

కాకతాళీయంగా జరిగింది: డీఎస్పీ షర్ఫుద్దిన్

నంద్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్‌లోని చాగలమర్రి గ్రామంలో ఈనెల 18వ తేదిన జరిగిన ఇమాం హుసేన్(22) హత్య వెనుక రాజకీయాలు లేవని, కాకతాళీయంగా జరిగినదని ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాగలమర్రి గ్రామ పంచాయతీకి జరిగిన వేలం పాటల్లో ఇరువర్గాల మధ్య జరిగిన వాగ్వాదం హత్యకు దారితీసిందని చెప్పారు. గత కొన్నేండ్ల నుంచి ఒక వర్గం వారు వేలాలను దక్కించుకుంటున్న తరుణంలో ఈసారి ఇమాంహుసేన్ బంధువులు పాల్గొనటంతో ఘర్షణ వాతావరణం నెలకొందని అన్నారు. ఇమాం హుసేన్ తన తండ్రి రసూల్‌కు అండగా నిలబడటంతో అక్కడే ఉన్న అబ్దుల్ ఖాదర్ కుమారుడు దస్తగిరి తన దగ్గర ఉన్న పిడిబాకుతో ఇమాం హుసేన్ గొంతులో పొడిచాడని అన్నారు. చాగలమర్రి ఎస్ఐ రమణయ్య అక్కడికి చేరుకొని ఇమాం హుసేన్‌ను కేరళ వైద్యశాలకు తరలిస్తుండగా ఆయన మరణించాడని డీఎస్పీ వివరించారు. మృతుడి తండ్రి రసూల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. చాగలమర్రి మండలం మల్లెవేముల గ్రామం వద్ద అబ్దుల్ ఖాదర్, దస్తగిరిలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి పిడి బాకు, సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకొని రిమాండుకు తరలించామన్నారు. నిందితులు, మృతుడి బంధువులు వైసీపీలో కొనసాగుతున్నారని డీఎస్పీ షర్ఫుద్దీన్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ట్రైని డీఎస్పీ రాఘవ, ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంత నాయక్, చాగలమర్రి ఎస్ఐ రమణయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.



నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ షర్ఫుద్దీన్

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం..

● ప్రియురాలు బాలిక మృతి

● ప్రియుడిపై కిడ్నాప్ కేసు నమోదు

మంత్రాలయం, మార్చి 20: మంత్రాలయం మండలంలోని చెట్నహళ్లి గ్రామానికి చెందిన ఓ మైనర్(17) అదే గ్రామానికి చెందిన టైలర్‌గా పని చేస్తున్న బెస్త శివ ప్రేమించుకున్నారు. వీరి కులాలు వేరు కావడంతో పెద్దలు వివాహానికి నిరాకరించారు. దీంతో ఈ నెల 18న సోమవారం ఇంటి నుంచి మోటారు సైకిల్‌పై వెళ్లిపోయారు. అదేరోజు వెంట తెచ్చుకున్న క్రిమిసంహారక మందును కోసిగి మండల సమీపంలో ఆత్మహత్యకు యత్నించారు. స్థానికులు గమనించి కోసిగి ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం ఆదోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి బాలికను మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రియుడిపై కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపినాథ్ తెలిపారు. శివ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు. మృతురాలిని కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

శ్రీశైలం ఘాట్‌లో రోడ్డు ప్రమాదం


- విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ



శ్రీశైలం, మార్చి 20: శ్రీశైలం ముఖద్వారానికి సమీపంలోని ఘాట్‌రోడ్డులో బుధవారం ఓ లారీ (డీసీఎం) అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రకాశం జిల్లా వనకనలమెట్ల మండలం, రేగడిపల్లి గ్రామానికి చెందిన లారీ దాదాపు 50 మందికి పైగా జనంతో శ్రీశైలానికి బయలుదేరింది. శ్రీశైలం ముఖద్వారం సమీపంలోని మలుపువద్ద లారీ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భక్తులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. కాసేపటి తర్వాత దేవస్థానం బస్సుల ద్వారా భక్తులను శ్రీశైలానికి చేర్చారు.

మూడో రోజు 589 మంది గైర్హాజర్

● ప్రశాంతంగా పది పరీక్షలు



కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 20: పదో తరగతి పరీక్షల్లో భాగంగా మూడో రోజు బుధవారం కర్నూలు జిల్లా వ్యాప్తంగా 589 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ శామ్యూల్ తెలిపారు. 31,465 మంది విద్యార్థులకు గాను 30,876 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. జిల్లా పరిశీలకుల అధికారి (డీఎల్‌వో) 5 పరీక్ష కేంద్రాలను, జిల్లా విద్యాశాఖ అధికారి 3 పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 7, సిట్టింగ్ స్క్వాడ్‌లు 44 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు డీఈఓ తెలిపారు.

నందవరం హుండీ ఆదాయం రూ.34.67 లక్షలు

బనగానపల్లె, మార్చి 20: బనగానపల్లె ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. హుండీ ఆదాయంలో రూ.34.67 లక్షలు రాగా, 33 గ్రాముల బంగారు, 3.30 కిలోల వెండి సమకూరినట్లు ఈఓ జి.కామేశ్వరమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'సింగిల్‌విండో' ద్వారా ఎన్నికల ప్రచారాలకు అనుమతి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 20: ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సింగిల్ విండో ద్వారా 'ఫస్ట్ ఇన్ - ఫస్ట్ ఔట్' పద్ధతిలో దరఖాస్తు చేసుకున్న వెంటనే అనుమతులు ఇస్తామని జిల్లా ఎన్నికల అధికారి/ కలెక్టర్ జి.సృజన రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంసీసీ అమలును జిల్లా పరిషత్ సీఈవో, హౌసింగ్ పీడీ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. పర్యవేక్షణ కోసం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఒక కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సువిధ పోర్టల్ (suvidha.eci.gov.in) వెబ్‌సైట్ ద్వారా నామినేషన్లు, ప్రచారాలు, పోస్టర్లు, రిజిస్ట్రేషన్ చేసుకుని అనుమతులు పొందాలన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు కోరే ప్రతి అనుమతి ఎన్‌కోర్ (encore.eci.gov.in) వెబ్‌సైట్ ద్వారా నెల రోజుల వ్యవధితో అనుమతులు ఇస్తామన్నారు. సమయం ముగిశాక మళ్లీ నమోదు చేసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాలో వాహనాల అనుమతుల కోసం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్వోల కార్యాలయంలో కూడా సింగిల్ విండో పోర్టల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బహిరంగ సభలో ఉపయోగించే లౌడ్‌స్పీకర్ రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఉపయోగించకూడదన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.



రాయలసీమ విశ్వవిద్యాలయంలో స్ట్రాంగ్ రూమ్స్ కౌంటింగ్ హాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్‌లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ కేంద్రాలను ఎస్పీ జి.కృష్ణకాంత్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ బ్లాక్, లైఫ్ సైన్స్ బ్లాక్, లైబ్రరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీలో 8 నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్స్ కౌంటింగ్ హాళ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

గుప్తనిధుల వేటగాళ్లు అరెస్టు

ఆత్మకూరు, మార్చి 20: ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ పరిధిలోని నాగలూటి రేంజ్, వెంకటాపురం బీట్ పరిధిలోని నాగలూటి వీరభద్ర స్వామి ఆలయం వద్ద గుప్తనిధుల వేటకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు రేంజ్ అధికారి దొరస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం నిందితులను మీడియా ఎదుట హాజరుపర్చి వివరాలు వెల్లడించారు. వెలుగోడు పట్టణానికి చెందిన వెంకయ్య, గోవర్ధన్ ఆచారి అనే వ్యక్తులు నాగలూటి వీరభద్రస్వామి ఆలయం వద్ద గుప్తనిధుల వేటకు పాల్పడినట్లు తమకు సమాచారం వచ్చిందని అన్నారు. వారిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపించినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో డీఆర్ఓ రత్నప్రభ, సిబ్బంది ఉన్నారు. ఇదిలావుంటే ఈ కేసులో మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిసింది.



పట్టుబడిన గుప్తనిధుల వేటగాళ్లు

ఆ ప్రొఫెసర్లు మళ్లీ విధుల్లోకి...

● కర్నూలు మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్లు, అసోసియేట్లకు అవకాశం

కర్నూలు(హాస్పిటల్), మార్చి 20: కర్నూలు మెడికల్ కాలేజీలో పదవి విరమణ చేసిన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లను మళ్లీ విధుల్లోకి తీసుకోనున్నారు. ఈ మేరకు గవర్నమెంటు ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ నెంబర్ 11/2024ను జారీ చేసింది. దీని ప్రకారం రిటైర్డయిన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఒక సంవత్సరం కాంట్రాక్టు ప్రాతిపదికన మెడికల్ కాలేజీ, బోధనాసుపత్రుల్లో చేరనున్నారు. ఎండీఎంస్ చేసిన వైద్యులు సూపర్ స్పెషాలిటీ వైద్యులకు బోర్డు అవకాశం కల్పించింది. ఈ నెల 16 నుంచి 25వ తేదీలోపు వైద్యులు ప్రిన్సిపాల్‌కు రూ.1000 ఫీజుతో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకునే వారు 69 సంవత్సరాలలోపు ఉండాలి. ఎండీఎంఎస్ చేసిన ప్రొఫెసర్‌కు రూ.2లక్షలు, అసోసియేట్‌కు రూ.1.5 లక్షలు, సూపర్ స్పెషాలిస్టుల ప్రొఫెసర్‌కు రూ.2.5 లక్షలు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.2 లక్షల వేతనం ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. కర్నూలు ప్రభుత్వ బోధనాసుపత్రు ల్లో ప్రొఫెసర్ల పోస్టుల్లో కార్డియాలజీ-1, నెఫ్రాలజీ-1, న్యూరోసర్జరీ-1 సర్జికల్ అంకాలజీ-1, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ-1 ఓబీజీ-2 డీవీఎల్-1, ఫోరెన్సిక్ మెడిసిన్-1, కార్డియాలజీ-1, మెడికల్ అంకాలజీ-1, రేడీయాలజి అంకాలజీ-1, సర్జికల్ అంకాలజీ-1, యురాలజీ-1, రేడియో డయోగ్నస్టిక్-1, పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఏపీఎంఎస్ బోర్డు మెంబర్ సెక్రటరీ వివరాలను ప్రకటించారు. కర్నూలు ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో వైద్యుల పోస్టులను భర్తీ చేయడానికి అవసరమున్న చోట ప్రొఫెసర్లను భర్తీ చేయనుంది.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఘనంగా పిచ్చుకల దినోత్సవం



పిచ్చుకల దినోత్సవంలో పాల్గొన్న సమాఖ్య సభ్యులు

నంద్యాల (కల్చరల్/టౌన్), మార్చి 20: నంద్యాల నందిరైతు సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం సమాఖ్య కార్యాలయంలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్ అధ్యక్షతన జీవవైవిధ్యం-పిచ్చుకల సంరక్షణ అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు మాధవస్వామి, కైలాస్‌నాథరెడ్డి, దంత వైద్యులు డా. కిషోర్‌కుమార్, ఓబులపతి వక్తలుగా పాల్గొన్నారు. పిచ్చుకలు రైతుల నేస్తాలని కొనియాడారు .సెల్ తరంగాలు, రేడియేషన్, పర్యావరణ కాలుష్యం కారణంగా పిచ్చుకలు మనుగడ కష్టంగా మారిందన్నారు. పిచ్చుకల గూళ్ల సాంకేతిక పరిజ్ఞానంలో మనిషిని తలదన్నే విధంగా నైపుణ్యాన్ని ప్రదర్శించడం సృష్టిలో అద్భుతం అని వక్తలు కొనియాడారు. పిచ్చుకల జీవనవిధానం గురించి కవితలు వినిపించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రఫీ, బాలచంద్రుడు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు నగదు ప్రోత్సాహకం



నగదు ప్రోత్సాహకాలను పంపిణీ చేస్తున్న అధికారులు

ఆత్మకూరు, మార్చి 20: ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలో గత ఫిబ్రవరి నెలలో ఉత్తమంగా రాణించిన ఆర్టీసీ ఉద్యోగులకు బుధవారం ఆర్టీసీ ఉన్నతాధికారులు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. డిపో మేనేజర్ మహేంద్రుడు మాట్లాడుతూ ఫిబ్రవరి -2024 నెలకు సంబంధించి కడప జోన్ పరిధిలో 78ఓఆర్ సాధించి డిపోను ప్రథమ స్థానంలో నిలుపడమే కాకుండా 5.51కేఎంపీఎల్‌తో ఇంధనాన్ని పొదుపు చేసి జిల్లాలోనే తమ డిపో కార్మికులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. అందుకు గానూ కండక్టర్లు జీఆర్ఎల్‌రెడ్డి, ముర్తుజాబీ, జీవీ స్వామి, పీఎం జ్యోతి, సరస్వతి, రూపావాణి, జీఎస్ ప్రతాప్‌తో పాటు ఉత్తమ కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు శివారెడ్డి, పీఆర్‌సీ రెడ్డి, ఎస్‌కే వలి, దర్గయ్య, జీవీ.రమణ, ఎంఎస్ నాయక్‌లకు ప్రోత్సాహక బహుమతులతో పాటు ప్రశంస పత్రాలను పంపిణీ చేశారు. అదేవిధంగా 2023 సంవత్సరంలో స్టేట్ బెస్ట్ యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్‌గా ఎంఎం.బాషా ఎంపిక కావడంతో ఆయనను సన్మానించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

పోస్టరు విడుదల

నంద్యాల (కల్చరల్), మార్చి 20: నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఓటు ఆవశ్యకతను తెలిపే గోడ పత్రికను కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు ఆవిష్కరించారు. అలాగే జెసి చాంబర్‌లో ఓటు ఆవశ్యకతను తెలిపే గోడ పత్రికను జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి కూడా ఆవిష్కరించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

పగిడ్యాల, మార్చి 20: మండలంలోని పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముచ్చుమర్రి జడ్పీ హైస్కూల్, లక్ష్మాపురం అంచె సమీపంలోని గురుకుల పాఠశాలలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్ బాలజీ నాయక్ తనిఖీ చేసినట్లు ఆయా కేంద్రాల పరీక్షల నిర్వాహణాధికారులు తెలిపారు. అలాగే పగిడ్యాల జడ్పీ హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రాన్ని సిట్టింగ్ స్క్వాడ్ రవీంద్రా గౌడ్, శ్రీనివాసరెడ్డి పరిశీలించారు.

ఆత్మకూరు: ఆత్మకూరు మండలంలో బుధవారం జరిగిన పది పబ్లిక్ పరీక్షలకు 89 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి-1 జానకీరామ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ శ్రీచైతన్య హైస్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, శ్రీపద్మావతి హైస్కూల్, డీపాల్ హైస్కూల్, గౌతమ్ హైస్కూల్ పరీక్షా కేంద్రాలకు సంబంధించి మూడో రోజైన బుధవారం ఇంగ్లీష్ పరీక్షకు మొత్తం 1310 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1221 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

కొత్తపల్లి: మండలంలోని గోకవరం, కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పది పబ్లిక్ పరీక్షలకు బుధవారం 39 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా సెంటర్ల చీఫ్ ఎగ్జామినర్లు రఘుస్వామి, ఇబ్రహీం తెలిపారు. బుధవారం మూడో రోజు ఇంగ్లీషు పరీక్షకు కొత్తపల్లి సెంటరులో 167 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 146 మంది హాజరు కాగా, 21 మంది గైర్హాజరయ్యారు. అలాగే గోకవరం సెంటరులో 97 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 79 మంది హాజరు కాగా, 18 మంది గైర్హాజరయ్యారని చెప్పారు.

మహిళ ఆత్మహత్య

పగిడ్యాల, మార్చి 20: మండలంలోని సంకిరేణిపల్లె గ్రామానికి చెందిన చాకలి రమణమ్మ (51) అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ తెలిపిన వివరాలివీ.. గత కొన్ని రోజుల నుంచి కుటుంబంలో కలహాలు చోటు చేసుకోవడంతో మనస్థపంతో మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మహిళ కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సిబ్బందికి షోకాజ్ నోటీస్

నంద్యాల రూరల్, మార్చి 20: ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కోడ్ అమలులో కష్టాలు అనే వార్తకు అధికారులు స్పందించారు. సంబంధిత సిబ్బందికి నోటీసులు ఇచ్చారు. చాపిరేవుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డా. సహలంను వివరణ కోరగా జిల్లా వైద్యాధికారి డా. వెంకటరమణ నోటీస్ ఇచ్చారని చెప్పారు. ఎంపిడీవో సౌభాగ్యమ్మ మాట్లాడుతూ చాపిరేవుల కార్యదర్శికి నోటీసు జారీ చేసి వివరణ తీసుకొని కలెక్టర్‌కు సమర్పించామన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది కోడ్ గీత దాటొద్దని హెచ్చరించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నంద్యాల రూరల్ మార్చి 20: నంద్యాల జిల్లా కేంద్రంలోని ఇంద్ర ప్రస్థ సమావేశ భవనంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ మహిన ఆర్థిక మోసాలు జరగకుండా తీసుకోవా ల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ వైబీ శ్రీధర్ రెడ్డి సైబర్ మోసాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ 1 పూర్ణిమ, మేజర్ 2 సమ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ నాగ ప్రవీణ్, నాబార్డ్ డీడీఎం సుబ్బారెడ్డి, జిల్లా బ్యాంక్ లింకేజీ కో ఆర్డినేటర్ ఎల్లయ్య పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, మార్చి 20: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో బుధవారం బళ్ళారికి చెందిన ప్రగతి నృత్య కళా ట్రస్ట్ బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నటేశకౌత్వం, భో..శంభో, జతిస్వరం, అదిగదిగో శ్రీశైలం తదితర గీతాలకు రంగలక్ష్మీ, ప్రజ్ఞారాధ్య, లక్ష్మీ సహస్ర, కీర్తి, సరస్వతి, శివగాయత్రి, శ్రీవల్లి, నవ్యశ్రీ, కార్తీక్‌రెడ్డి తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

● శ్రీశైలం మహాక్షేత్రంలో లోకల్యాణం కోసం బుధవారం ఉదయం సాక్షి గణపతి స్వామికి విశేష అభిషేకం, పూజలు నిర్వహించారు. అభిషేకాన్ని పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, కలశోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్దజలాలతో అభిషేకాన్ని జరిపి మహా మంగళ హారతులను సమర్పించారు. ఈ అభిషేక పూజల వలన అనుకున్న పనులలో అటంకాలు తొలగి విజయం కలుగుతుందని, సిరిసంపదలు పెరుగుతాయని, ముఖ్యంగా విద్యార్థులలో ఆలోచన శక్తి పెరుగుతుందని చెప్పబడుతుంది.

● శ్రీశైలం క్షేత్రంలో లోకకళ్యాణంకోసం మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో ఉత్తరభాగంలో ఉన్నటువంటి జ్వాలావీరభద్ర స్వామికి ప్రదోషకాలంలో విశేష అభిషేకం, పూజలు నిర్వహించింది. ఈ స్వామికి అఘోర వీరభద్రమూర్తి అని పేరు కూడా ఉంది. స్వామికి పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్దజలాలతో అభిషేకం నిర్వహించారు.

ఎండీయూ వాహనంపై చిత్రాలు



మిడుత్తూరు తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న ఎండీయూ వాహనం

నందికొట్కూరు, మార్చి 20: మిడ్తూరు మండల కేంద్రంలో ఎండీయూ వాహనంపై ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి చిత్రాలు కనిపించాయి. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చి 4 రోజులు అవుతున్నా... మిడ్తూరు తహసీల్దార్ కార్యాలయం సాక్షిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కనిపించింది. ఎండీయూ వాహనంపై ఉన్న రాజకీయ నాయకుల చిత్రాలు కనిపించకుండా అతికించిన పేపర్లు చినిగిపోయాయి. దీంతో వాహనంపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఆయన తండ్రి రాజశేఖర్‌రెడ్డి చిత్రాలు కనిపిస్తూ దర్శనమిచాయి.

తొలగిన ముసుగు

నందికొట్కూరు, మార్చి 20: పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి వేసిన ముసుగును మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈనెల 16వ తేదీ నుంచి ఎన్నికల కోడ్‌లో భాగంగా శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి ముసుగు వేశారు. అయితే ఆర్యవైశ్య సంఘం నాయకులు పొట్టి శ్రీరాముల విగ్రహానికి ముసుగు ఎలా వేస్తారని ప్రశ్నించి, తొలగించాలంటూ వినతిపత్రాలు అసిస్టెంట్ ఆర్వోకు, మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. దీంతో కలెక్టర్ శ్రీనివాసులతో మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడి బుధవారం పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఉన్న ముసుగును తొలగించారు.

ముగిసిన జగజ్జననీదేవి ఆలయ వార్షికోత్సవాలు



ముగింపు వేడుకల్లో పాల్గొన్న భక్తులు

నంద్యాల (కల్చరల్), మార్చి 20: నంద్యాల జగజ్జననీ నగర్‌లో వెలసిన జగజ్జననీ దేవి ఆలయ ద్వాదశ వార్షిక వేడుకలు బుధవారం ముగిశాయి. ఉదయం ప్రభాత పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో చండీహోమాలు నిర్వహించారు. అనంతరం బలిప్రదానం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రకాల పూల దండలతో అమ్మవారి ఆలయాన్ని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి మెక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం మహా మంగళ హారతి కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ప్రదోషపూజా, మహా మంగళ హారతి ఇచ్చారు.

కొత్తపల్లి ఈవోఆర్డీగా శివరాం

కొత్తపల్లి, మార్చి 20: కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై ఈవోఆర్డీగా శివరాం విధుల్లో చేరినట్లు ఎంపీడీవో జవహర్‌బాబు బుధవారం తెలిపారు. ఇక్కడ ఈవోఆర్డీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసనాయుడు గత ఏడాది పాములపాడు మండలానికి బదిలీపై వెళ్లడంతో ఇక్కడ ఈవోఆర్డీ పోస్టు ఖాళీగా ఏర్పడింది. ఈ మేరకు ఉన్నతాధికారులు బనగానపల్లెలో ఈవోఆర్డీగా విధులు నిర్వహిస్తున్న శివరామ్‌ను డిప్యూటేషన్‌పై బదిలీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

'విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులు పర్యవేక్షించాలి'

పాణ్యం, మార్చి 20: విద్యార్థుల ప్రగతిని నిరంతరం తల్లిదండ్రులు పర్యవేక్షించాలని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యం సూచించారు. కళాశాలల మొదటి సంవత్సర విద్యార్థుల తల్లిదండ్రులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు సరైన సూచనలు, సలహాలు అందించాలన్నారు. కళాశాలలో అధ్యాపకులు తమ వంతు కృషి చేస్తూ వారి అభివృద్ధికి సహకరిస్తారన్నారు. ఇంటిలోని వాతావరణమే విద్యార్థులకు మొదటి పాఠశాల అన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ డాక్టర్ శేషయ్య, కోఆర్డినేటర్ డాక్టర్ హరిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయన్ని లెక్కిస్తున్న భక్తులు

నంద్యాల (కల్చరల్), మార్చి 20: నంద్యాల బస్టాండు దగ్గరలో వెలసిన ఆంజనేయ కోదండరామస్వామి దేవస్థానం హుండీ దాదాయాన్ని బుధవారం లెక్కించగా రూ.5,53,906 వచ్చినట్లు ఆలయ ఈవో రామాంజనేయశర్మ తెలిపారు. దేవదాయశాఖ తనిఖీ అధికారి శశికుమార్ పర్యవేక్షణలో ఈ హుండీ ఆదాయాన్ని లెక్కించారు. దేవస్థానం హుండీని లెక్కించగా రూ.4,34,537, అన్నదానం హుండీని లెక్కించగా రూ.1,19,369 వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ రెండు హుండీల మొత్తము కలిపి రూ.5,5,3906 వచ్చిందని చెప్పారు. గత సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరం రూ.13,434 ఆదాయం అధికంగా వచ్చిందని ఈవో తెలిపారు. దేవస్థానం చైర్మన్ చెన్న వెంకటేశ్వర్లు, ధర్మకర్తలు, అర్చకులు జీవీ సుబ్బయ్య, బాలాజి సేవా ట్రస్టు సభ్యులు, మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ



మెటీరియల్‌ను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్

నంద్యాల (నూనెపల్లె), మార్చి 20: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకై పాలిసెట్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు నంద్యాలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలిసెట్ -2024కు ఫిబ్రవరి 20 వ తేదీ నుంచి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో తీసుకోవడం జరుగుతుందని, దరఖాస్తు ఫారాలను ఏప్రిల్ 5వ తేదీ చివరి గడువులోపు దాఖలు చేయాలని సూచించారు. 10వ తరగతి తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పాలిసెట్‌కు అర్హులని అన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100 దరఖాస్తు రుసుం చెల్లించి నమోదు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఏప్రిల్ 25వ తేదీ వరకు నంద్యాలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. కోచింగ్‌తో పాటు ఫ్రీ మెటీరియల్‌ను ఇవ్వనున్నట్లు చెప్పారు.

'తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు'

నందికొట్కూరు, మార్చి 20: పట్టణంలో తలెత్తుతున్న తాగునీటి, డ్రైనేజ్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకూడదనే ఉద్దేశంతో ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. పట్టణంలోని డ్రైనేజీలను శుభ్రంగా ఉంచుతున్నామన్నారు. వేసవి దృష్ట్యా పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు బోర్లు వేస్తున్నామని, ఎక్కువ నీళ్లు ఉన్న బోర్లను నీటి సమస్య తీవ్రంగా ఉండే కాలనీలకు మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. అధికారులు ఏ పార్టీకి కొమ్ము కాయరని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేయడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగిపై ఉందని అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంసీసీ నిబంధనల మేరకు ఎన్నికల విధులను నిర్వర్తిస్తున్నామన్నారు.

'రాజకీయాలకు వలంటీర్లు దూరంగా ఉండాలి'

బండిఆత్మకూరు, మార్చి 20: వలంటీర్లు, ఉద్యోగులు రాజకీయాలకు దూరంగా ఉండాలని ఎంపీడీవో విజయరావు సూచించారు. బుధవారం మండలంలోని శింగవరం గ్రామ వలంటీర్లపై ఫిర్యాదులు రావటంతో ఎంపీడీవో వెంటనే సమావేశం నిర్వహించారు. వలంటీర్లు ఎవరు ఎన్నికలకు సంభందించి ఏపార్టీని, నాయకున్ని ప్రోత్సహించరాదని, అలా చేస్తున్నట్లు తెలిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యదర్శి సుజాత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులతో వాగ్వాదం

పాణ్యం, మార్చి 20: పోలీసులు, సుగాలీల మధ్య వాగ్వాదం జరిగింది. బర్రెను ఎవరు చంపారో తెలిస్తేనే రహదారికి అడ్డు తొలగిస్తానని సుగాలిమెట్ట గ్రామ నివాసి రవినాయక్ పేర్కొన్నట్లు రెవెనన్యూ అధికారులు తెలిపారు. సుగాలిమెట్టలో రహదారి ఆక్రమణపై ఈనెల 20న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన రహదారిని ఆక్రమించిన ఘనుడు వార్తకు స్పందించిన పోలీసులు, రెవెన్యూ సిబ్బంది బుధవారం హుటాహుటిన గ్రామానికి వెళ్లి సమస్యను పరిశీలించారు. రవినాయక్‌ను వీఆర్వో శ్రీనివాసులు, ఏఎస్ఐ రఫిక్, పంచాయతీ కార్యదర్శి సంతోష్‌లు వివరణ కోరారు. దీనిపై రవినాయక్ మట్లాడుతూ మూడు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు తన బర్రెను చంపారని ఎవరు చంపారో తెలియాలని రహదారిని మూసివేశానని అధికారులతో వాగ్వివాదానికి దిగారు. బర్రె మృతిపై పోలీసులకు పిర్యాదు చేయాలని, బర్రె పోస్టుమార్టం నిర్వహించి నిజనిజాలు తెలుసుకోవాలని వీఆర్వో సూచించారు. తనకు న్యాయం జరిగే వరకు రహదారిని మూసివేస్తానని చెప్పడంతో పోలీసులు పోలీసు స్టేషన్‌కువచ్చి ఫిర్యాదు చేయాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని చెప్పడంతో రెండు రోజులు సమయం కావాలని పోలీసు స్టేషన్‌లో తనకు న్యాయం చేయాలని కోరడంతో రెవెన్యూ, పోలీసు సిబ్బంది అక్కడినుంచి వెనుతిరిగారు. ఏఎస్ఐ రఫిక్, సిబ్బంది మన్సూర్, మధు, వీఆర్ఏ ప్రసాదు, మహిళా పోలీసు విజయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన శుద్ధి కేంద్రాల ఆకస్మిక తనిఖీ



పరీక్షిస్తున్న వ్యవసాయాధికారులు

నంద్యాల (టౌన్/రూరల్), మార్చి 20: నంద్యాలకు చెందిన పలు పత్తి విత్త శుద్ధి కేంద్రాలను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం వ్యవసాయ శాఖ కమీషనర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు ఆధ్వర్యంలో కమిషనరేట్ ఏడీ ఎం.ప్రేమ్ శేఖర్, ఏవో వీఎస్ సురేషన్, నంద్యాల ఏడీ రాజశేఖర్, ఏవో ప్రసాదరావు, తదితరుల బృందం విత్తన శుద్ధి కేంద్రాలను తనిఖీలు చేశారు. శ్రావణ లక్ష్మీ సీడ్స్, వినాయక ఆగ్రో ఇండస్ట్రీస్, భవ్య సీడ్స్, భారతి సీడ్స్, నాగవేంకటేశ్వర సీడ్స్ కేంద్రాలలో తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన కంపెనీల విత్తనాలు మాత్రమే ప్రాసెసింగ్ చేయాలని, విత్తశుద్ధి చేసే ప్రతి కేంద్రానికి కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమలు పొంది ఉండాలని అధికారులు పేర్కొన్నారు. తనిఖీలలో శ్రావణ లక్ష్మీ సీడ్స్‌లో 4 లాట్లు, భవ్య సీడ్స్‌లో 6 లాట్లు, వినాయక ఆగ్రోలో 3 లాట్లు, భారతీ సీడ్స్‌లో 8 లాట్లను హెచ్‌టీ కాటన్ స్ట్రీప్ టెస్టు నిర్వహించగా ఇందులో హెచ్‌టీ నెగిటివ్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆయా విత్తన అభివృద్ధి సంస్థల యాజమాన్యాలను అధికారులు ఆదేశించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వారిపై విత్తన చట్టం -1966, విత్తన నియంత్రణ క్రమం -1983 ప్రకారం చర్యలు తీసుకుంటామని తనిఖీ అధికారులు హెచ్చరించారు.

'టీడీపీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'



సమావేశంలో మాట్లాడుతున్న గౌరు దంపతులు

గడివేముల, మార్చి 20: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, టీడీపీ మేనిఫెస్టోను ప్రజల్లోకి పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరుచరిత, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకట్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం వారు నాయకులతో సమావేశమయ్యారు. గ్రామాల్లోని సమస్యలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో దౌర్జన్యాలు, అరాచకాలు పెరిగాయని, గ్రావెల్, ఇసుకను వైసీపీ నాయకులు యథేచ్ఛగా దోచుకున్నారన్నారు. పాణ్యం నియోజకవర్గంలో రిటైర్డ్ ఉద్యోగుల స్థలాలను కబ్జా చేశారని ఆరోపించారు. కుంగిన అలగనూరు రిజర్వాయర్ కరకట్టకు మరమ్మతులు చేయలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని అన్నారు. దొంగ ఓట్లను గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. బూత్ కన్వీనర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. టీడీపీ అధికారంలోకి బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకొస్తామన్నారు. ఆదరణ పథకంతో చేతి వృత్తుల వారికి పనిముట్లను అందిస్తామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ సీతారామిరెడ్డి, పంట రామచంద్రారెడ్డి, కృష్ణయాదవ్, ఎస్ఏ రఫిక్, మురళీమోహన్‌రెడ్డి, గని హర్ష, వడ్డు లక్ష్మీదేవి, సుభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం'



వైసీపీ నాయకుడిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఫరూక్, రాజశేఖర్

గోస్పాడు, మార్చి 20: వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని, రాష్ట్ర భవిష్యత్తు టీడీపీ చేతుల్లోనే ఉందని మాజీ మంత్రి, టీడీపీ నంద్యాల అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. బుధవారం గోస్పాడులో వైసీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జిన్నా శ్రీనివాసరెడ్డితో పాటు వైసీపీ నుంచి భారీ సంఖ్యలో ఫరూక్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఫరూక్ మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేశారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ టీడీపీ మేనిఫెస్టోకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని అన్నారు. బీజేపీ, జనసేన, తెలుగుదేశం కూటమి విజయం ఖాయమైపోయిందని అన్నారు. కార్యక్రమంలో ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు ఏవీఆర్ ప్రసాద్, తాతిరెడ్డి తులసిరెడ్డి, మండల అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని నంద్యాల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాల మండలంలోని బాపూజీ నగర్‌లో బుధవారం శంఖారావం కిట్ల పంపిణీ చేశారు. ఫరూక్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పట్టణాలు, పల్లెల అభివృద్ధిని విస్మరించిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే బాపూజీ నగర్‌ను సమగ్రాభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

టీడీపీలోకి ఘనపురం ఎంపీటీసీ



టీడీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు రూరల్, మార్చి 20: నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో టీడీపీ నాయకుడుమాండ్ర శివానందరెడ్డి సమక్షంలో పగిడ్యాల మండలంలోని ఘనపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఎంపీటీసీ వెంకటేశ్వర్లు యాదవ్ టీడీపీలో చేరారు. టీడీపీ మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరెడ్డి, గ్రామ నాయకులు చంద్రేష్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఆయనకు మాండ్ర శివానందరెడ్డి టీడీపీ కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో శేఖర్, ప్రశాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రాక్షస పాలనకు చరమగీతం పాడాలి'

నందికొట్కూరు రూరల్, మార్చి 20: రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలన కొనసాగిస్తోందని, చరమగీతం పాడాలని నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి జయసూర్య సూచించారు. నందికొట్కూరు మండలంలోని దామగట్ల గ్రామంలో బుధవారం మాండ్ర సురేంద్రనాథరెడ్డి, ఎంపీటీసీ తిప్పారెడ్డితో కలిసి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'కనకారావు వ్యాఖ్యలు సరికావు'



బండిఆత్మకూరులో మాట్లాడుతున్న నాయకులు

బండిఆత్మకూరు, మార్చి 20: మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు వ్యాఖ్యలు సరికావని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బెనర్జీ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఓబులేసు మాదిగ, ఎంఆర్పీఎస్ జిల్లా నాయకుడు వెంకటసుబ్బన్న మాదిగ మండిపడ్డారు. బుధవారం బండిఆత్మకూరులో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీ నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ తుది దశకు చేరుకుంటున్న నేపథ్యంలో ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకులు ఎన్డీఏ కూటమికి మద్దతు ఇవ్వాలని ఆలోచన చేస్తుండటం పట్ల కనకారావు మందకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేయటం తగదన్నారు. ఇంతరకు ఎస్సీ కార్పొరేషన్‌కు సీఎం ఒక రూపాయి విదల్చలేదని, దళితలకు అందే వివిద పథకాలు ఎత్తివేసిన వైసీపీ పట్ల ప్రేమ చూపటం తగదని, వెంటనే తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని అన్నారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్య రీతిలో తగిన గుణపాఠం చెబుతామన్నారు. బాలస్వామి, ధశరథుడు, ఎర్రమల, మునిస్వామి, తిరుపాల్, బాలశౌరి పాల్గొన్నారు.

'ఓటర్లు ప్రలోభాలకు గురి కాకూడదు'

పాణ్యం, మార్చి 20: ఓటర్లు ఎన్నికల్లో ప్రలోభాలకు గురికాకూడదని పాణ్యం సీఐ నల్లప్ప సూచించారు. మండలంలోని తమ్మరాజుపల్లెలో బుధవారం రాత్రి గ్రామ ప్రజలతో సమావేశం నిరహించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు అధికారులకు సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్‌ను కచ్చితంగా పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కోట్ల, కేఈ కుటుంబాలతోనే డోన్ అభివృద్ధి

మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి



గార్లదిన్నెలో కోట్ల సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ వర్గీయులు

ప్యాపిలి, మార్చి 20: కోట్ల, కేఈ కుటుంబాలతోనే డోన్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని మాజీ కేంద్ర మంత్రి, డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మాధవరం, గార్లదిన్నె, రాచెర్ల, రామక్రిష్ణాపురం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తన తండ్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, కేఈ కృష్ణమూర్తి ఉప ముఖ్యమంత్రిగా నియోజకవర్గంలో ఎన్నో శాశ్వతమైన అభివృద్ధి పనులు చేశారన్నారు. అయితే ఆర్థిక మంత్రి బుగ్గన డోన్‌ను తానే అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలను మభ్యపెట్టేందుకు నియోజకవర్గంలో మంత్రి చేపట్టిన పనులు పూర్తి చేయకుండానే ప్రారంభోత్సవాలు చేశారని కోట్ల విమర్శించారు. డోన్‌లో అధికారపార్టీ అరాచకాలు, దౌర్జన్యాలకు విసుగు చెందిన ప్రజలు వచ్చే ఎన్నికల్లో బుగ్గనను ఇంటికి పంపడం ఖాయమన్నారు. టీడీపీ అధికారం లోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో పేదరికాన్ని నిర్మూలిస్తామన్నారు. అనంతరం ఆయన ఇంటింటా తిరిగి టీడీపీ మేనిఫెస్టో పత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావు యాదవ్, నాయకులు మాధవరం స్వామి, ఆర్‌ఈ నాగరాజు, వై లక్ష్మీనారాయణయాదవ్, బీఈ రమణగౌడు, నబీరసూల్, బీఈ క్రిష్ణమూర్తి, సర్పంచు లక్ష్మీనారాయణ, రామ్‌కుమార్, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, కేసీ మద్దిలేటి రాచెర్ల శ్రీరాములు, సురేంద్ర, రజిని యాదవ్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ వర్గీయులు టీడీపీలోకి చేరిక: మండలంలోని గార్లదిన్నె గ్రామంలో బుధవారం వైసీపీ వర్గీయులు టీడీపీ డోన్ నియోజకవర్గ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావు సమక్షంలో పార్టీలో చేరారు. వైసీపీకి చెందిన వెంకట క్రిష్ణయ్య, వెంకటరాముడు, వార్డు మెంబరు రామచంద్రుడు, రాంబాబు, పుల్లన్నతో పాటు 25 కుటుంబాలు ఆ గ్రామ టీడీపీ నాయకుడు కుమ్మరి సుధాకర్ ఆధ్వర్యం లో పార్టీ తీర్థం తీసుకున్నారు. వారందరికి కోట్ల టీడీపీ కండువ కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు న్యాయవాది భాస్కర్‌నాయుడు, గండికోట రామసుబ్బయ్య, రామ్మోహన్‌యాదవ్, ప్రణీత్ యాదవ్, శేఖర్ రెడ్డి, సురేంద్రగౌడు, సందీప్, మధుశేఖర్, మాదవరాజు పాల్గొన్నారు.

బుగ్గనకు ప్రజలే బుద్ధి చెబుతారు : టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

డోన్, మార్చి 20: డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డికి డోన్‌లో ఇల్లు లేదని అధికార మదంతో హేళనగా మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో వారు విలేకరులతో మాట్లాడుతూ.. డోన్ నియోజకవర్గంలో కోట్ల కుటుంబం దశాబ్దాలుగా ప్రజలకు సేవ చేస్తోందన్నారు. కోట్ల హరిసర్వోత్తమ రెడ్డి డోన్ కమిటీ ప్రెసిడెంటుగా రెండుసార్లు పని చేశారన్నారు. ముఖ్యమంత్రి హోదాలో కోట్ల విజయభాస్కర్ రెడ్డి 1994 సంవత్సరంలో డోన్ అసెంబ్లీ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారన్నారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కర్నూలు ఎంపీగా మూడుసార్లు పని చేశారని, డోన్ నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని తెలిపారు. కోట్ల సుజాతమ్మ 2004 ఎన్నికల్లో డోన్ ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు అందించారన్నారు. ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచనతో కోట్ల కుటుంబం పని చేస్తుంది తప్ప.. బంగ్లాలు కట్టుకోవాలన్న ఆలోచన చేయలేదన్నారు. కోట్ల కుటుంబానికి డోన్‌లో ఇల్లు లేదని హేళన చేస్తున్న బుగ్గనను ప్రజలు ఓడించి ఆయనను బంగ్లాకే పరిమితం చేస్తారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు అమకతాడు గోవిందరెడ్డి, లారీల బాషా పాల్గొన్నారు.

అరాచక పాలనకు అంతం తప్పదు

భూమా అఖిలప్రియ



ముత్యాలపాడులో అఖిలప్రియ సమక్షంలో చేరిన వైసీపీ నాయకులు

చాగలమర్రి, మార్చి 20: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు అంతం తప్పదని ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో బుధవారం వైసీపీకి చెందిన 50 కుటుంబాలు భూమా అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరాయి. పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అంతక ముందు భూమా అఖిలప్రియ, భార్గవ్‌రామ్ గ్రామానికి చేరుకోగానే టీడీపీ నాయకులు, కార్యకర్తలు గజమాలలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ నాయకుల అరాచకాలు, దాడులు చూసి టీడీపీలో చేరుతున్నారని అన్నారు. వైసీపీ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అన్నారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహారెడ్డి, టీడీపీ నాయకులు ఇండ్ల లక్ష్మీరెడ్డి, రమణారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, హరిసాయినాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామ్మోహన్, గోపాల్, ఉసేన్‌రెడ్డి, బాలుడు, రామసుబ్బయ్య, సయ్యద్ రసూల్, షరీఫ్, బాష, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాకు మట్టి తోలితే కేసులు పెడతారా?

రుద్రవరం మార్చి 20: పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లిం నమాజ్ చేసకునేందుకు ఈద్గాకు మట్టి తోలితే రాజకీయం చేసి కేసులతో కేసులు పెట్టిస్తారా? అని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ధ్వజమెత్తారు. మండలంలోని చిలకలూరు గ్రామంలో ఈద్గా స్థలాన్ని పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి అరాచకాలకు అంతం పలికే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. చిలకలూరు, బత్తలూరు, ఎర్రగుంట్ల, మందలూరు చందలూరు, మాచినేనిపల్లె, పేరూరు గ్రామాలు తమ ఆధిపత్యంలో ఉండి తన కనుసన్నల్లో ఉండాలని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కేసులకు భయపడేది లేదని, చిలకలూరు ప్రజలకు అండగా నిలుస్తామని అన్నారు. ఒక ఆడబిడ్డ ఇంటింటికీ తిరిగి ప్రజలను కలిస్తే చివరి నిమిషంలో గలాటా చేస్తారా? అని మండిపడ్డారు. భార్గవరామనాయుడు, ఎల్‌వీ రంగనాయకులు, ఆలమూరు నారాయణ, ఎర్రం ప్రతాప్‌రెడ్డి, రజాక్, మహ్మద్ పాల్గొన్నారు.

ఏకాదశి పూజలు

చాగలమర్రి, మార్చి 20: మండలంలోని మద్దూరు గ్రామంలో ప్రముఖ ఉత్తరముఖ ద్వారం గల ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వేద పండితుడు కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో ఏకాదశి పూజలు నిర్వహించారు. స్వామికి పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీకి షాక్

- కొలిమిగుండ్ల, అవుకు మండలాల వైసీపీ నాయకులు టీడీపీలోకి వలస
- మాజీ ఎమ్మెల్యే బీసీ సమక్షంలో చేరిక



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 20: బనగానపల్లె నియోజకవర్గంలో రోజు రోజుకూ వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి భారీగా వలసలు హోరెత్తుతున్నాయి. బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో పార్టీ కార్యాలయంలో పచ్చ కండువాలతో టీడీపీలోకి జాతరలా వచ్చి చేరుతున్నారు. బుధవారం నియోజకవర్గంలోని కొలిమిగుండ్లకు చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో కొప్పుల శివ, బీగాల నరేంద్ర, కొప్పుల మధు, అందె కుమార్, విజయకాంత్, సతీశ్, పగడాల శివ, లక్ష్మీనారాయణ, అందె మధు, అందె రాజేంద్రప్రసాద్‌తో సహా 50 కుటుంబాలు బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీసీ జనార్దనరెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో అవినీతి, ధరల పెరుగుదల, నియంతృత్వ పాలన, నిరుద్యోగం వంటి కారణాలతో రాష్ట్రంలోని అన్ని వర్గాలు విసిగి వేసారి వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నట్లు బీసీ తెలిపారు.

● అంకిరెడ్డిపల్లె వైపీపీకి చెందిన 40 కుటుంబాలు బుధవారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. టీడీపీ బనగానపల్లె అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి ఎమ్మార్పీఎస్ నాయకులకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంకిరెడ్డిపల్లెకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు మాదిగ బాల దస్తగిరి, మాదిగ పుల్లయ్య, కొత్తకోట రామాంజీ, బొమ్మలనారాయణస్వామి, వెంగళ నాగరాజు, శివనారాయణ, మెట్టుపల్లె నాగకృష్ణుడు, లింగాల శ్రీరాములు, చినబాబు, రాముడు, చిననారాయణస్వామి, చిన్నపుల్లయ్య, దస్తగిరి, నడిపిపుల్లయ్య, పెద్దపుల్లయ్య ఇటిక్యాల ఓబులేసు, తదితర 40 కుటుంబాలు పార్టీలో చేరాయి. వీరికి బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

● అవుకు మండలం చెర్లోపల్లెకు చెందిన 20 వైసీపీ కుటుంబాలు బుధవారం వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామానికి చెందిన ఎరుకలిబాలు, శ్రీనివాసులు, వల్లపు చిన్నజమ్ములయ్య, అహ్మద్‌బాషా, ముక్కల శ్రీనివాసులు, సుబ్బరాయుడు, వెంకటేశ్, ముక్కల వెంకటసుబ్బయ్య తదితరులు టీడీపీలో చేరారు.

నిజాయితీకి ఓటు వేయండి: కోట్ల రాఘవేంద్రరెడ్డి



కోట్ల రాఘవేంద్రరెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

బేతంచెర్ల, మార్చి 20: ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, తమ ఓటును నిజాయితీకి వేసి రైతు బిడ్డ కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని ఆశీర్వదించాలని డోన్ టీడీపీ యువ నాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం బేతంచెర్ల నగర పంచాయతీ 6, 15, 16 కౌన్సిల్స్‌లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని కౌన్సిలర్ పోలూరు ఆదిలక్ష్మి, టీడీపీ సీనియర్ నాయకుడు పోలూరు రాఘవరెడ్డి, 15, 16 వార్డు కౌన్సిల్ స్థానిక నాయకులు మేకల నాగరాజు, రూబెన్, ఫయాజ్ ఆధ్వర్యంలో టీడీపీ పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్న లక్ష్మి, మండల కన్వీనర్ ఉన్నం ఎల్లనాగయ్య నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన కోట్ల రాఘవేంద్ర రెడ్డిని మండల టీడీపీ నాయకులు కార్యకర్తలు భారీ గజమాలతో సత్కరించారు. కోట్ల రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో డోన్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి నీతికి నిజాయితీకి మారుపేరు అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నాగరాజు, చల్లా మద్దిలేటిస్వామి, శ్రీకంటి మధు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తే చర్యలు: ఎస్‌ఐ



కారును తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రమేష్‌రెడ్డి

సంజామల, మార్చి 20: అక్రమంగా వాహనాలలో మద్యం తరలిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ రమేష్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం ఆల్వకొండ క్రాస్ రోడ్‌లో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ రహదారిలో ప్రయాణించే ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు మొదలైన వాహనాలను ఆపి సిబ్బందితో సోదాలు నిర్వహించారు. ఈసందర్భంగా హెల్మెట్ లేకుండా ప్రయాణించే వాహనదారులకు లైసెన్స్, ఇన్సూరెన్సు, రూట్ పరిమిట్ లేకుండా ప్రయాణంచే 15 వాహనాలకు రుసుం విధించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా కార్లు, ఆటోలు మోటరు బైక్‌లలో అక్రమంగా మద్యం తరలించిన, నగదు తరలించిన వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

కోట్ల చొరవతో రైల్వే బ్రిడ్జి వెడల్పు



వెంకటనాయునిపల్లె రైల్వే గేటు ఇదే

డోన్, మార్చి 20: కేంద్ర మాజీ మంత్రి, డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి చొరవతో మండలంలోని వెంకటనాయునిపల్లి రైల్వే బ్రిడ్జి వెడల్పుకు మోక్షం లభించింది. డోన్ మండలంలోని వెంకటనాయునిపల్లె రైల్వేగేట్ల మధ్య అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని వెంకటనాయునిపల్లె, కామగానిగుంట్ల, తిమ్మాపురం, ఆవులదొడ్డి గ్రామాలతో పాటు మరో 10 గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం పనులు ఆపాలని పలుమార్లు టీడీపీ, సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. రైల్వే ఉన్నతాధికారుల చుట్టూ ఆయా గ్రామాల ప్రజలు తిరిగినా ఫలితం లేకపోయింది. అయితే.. డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పేరు ప్రకటించిన తర్వాత వెంకటనాయునిపల్లె గ్రామస్థులు అండర్ పాస్ బ్రిడ్జి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడారు. అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే 15 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతారని, తగిన పరిష్కారం చూపా లని కోరారు. దీంతో దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ సానుకూలంగా స్పందించి వెంకటనాయునిపల్లె రైల్వేగేట్ల మధ్య నిర్మించే అండర్‌పాస్ బ్రిడ్జిని డబుల్ వెడల్పుతో నిర్మాణం చేపట్టేలా ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో 15 మీటర్లు ఉండే అండర్‌పాస్ బ్రిడ్జిని 30 మీటర్ల వెడల్పుతో రైల్వేబ్రిడ్జిని నిర్మించేందుకు అదనంగా రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి చొరవతో అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం వెడల్పు చేయడం పట్ల వెంకటనాయునిపల్లె, తిమ్మాపురం, కామగానిగుంట్ల, ఆవులదొడ్డి, తదితర గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం బాక్సులతో సెబ్ పోలీసులు

డోన్(రూరల్), మార్చి 20: డోన్‌లో వాహనంలో తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు దాడి చేసి స్వాధీనపరుచుకున్నారు. సెబ్ సీఐ జయనాథరెడ్డి, సెబ్ ఎస్‌ఐ సోమశేఖర్‌తో కలిసి బుధవారం వివరాలు వెల్లడించారు. డోన్ పట్టణంలోని కొత్తపేటకు చెందిన ఈశ్వర్‌గౌడు కర్ణాటక ప్రాంతం రాయచూరు నుంచి కర్ణాటక మద్యాన్ని వాహనంలో తీసుకుని పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన యశోదమ్మ ఇంటికి తరలిస్తుండగా.. ప్రభుత్వ ఐటీఐ సమీపంలో ప్రధాన రోడ్డులో దాడులు నిర్వహించి నిందితుడ్ని పట్టుకున్నారు. నిందితుడి నుంచి 32 కాటన్ బాక్సులులో ఉన్న ఒరిజినల్ చాయిస్ టెట్రా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ బాక్సుల్లో 3,072 టెట్రా మద్యం ప్యాకెట్లు ఉన్నాయని, వీటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని సెబ్ అధికారులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు వారు తెలిపారు.

నాటుసారా స్వాధీనం, బైక్ సీజ్

బనగానపల్లె: పట్టణ శివారులోని అయ్యప్ప గుడి వద్ద బనగానపల్లెకు చెందిన షేక్ దస్తగిరి, ఇమామ్‌హుసేన్‌లు బైక్‌పై నాటుసారా తరలిస్తుండగా సారాను స్వాధీనం చేసుకొని ఇరువురిని అరెస్టు చేసి బైక్‌ను సీజ్ చేసినట్లు సెబ్ సీఐ జోగేంద్ర బుధవారం తెలిపారు.

అలాగే మండలంలోని రామతీర్థం గ్రామ సమీపంలోని ఆటవీ ప్రాంతంలో నాటుసారా తయారు చేస్తున్న బట్టీలపై దాడులు నిర్వహించి 1800 బెల్లం ఊటను ధ్వంసం చేసి 40 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నాటుసారా బట్టీల నిర్వాహకులు కావేటి టి శ్రీను, కావేటి టి బాలమద్దిలేటిలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పోతులయ్య, సెబ్ సిబ్బంది అంజాద్‌బాషా పాల్గొన్నారు.

చంద్రబాబు మాటపై నమ్మకం ఉంది

టీడీపీ నాయకుడు ధర్మవరం సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

ప్యాపిలి, మార్చి 20: టీడీపీ డోన్ సీటు తనకే ఇస్తానని ప్రకటించిన పార్టీ అధినేత చంద్రబాబు మాటపై నమ్మకం ఉందని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ డోన్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఎవరు రాకపోవడంతో అధినేత తనను నియమించారన్నారు. ఆయన ఆదేశాల ప్రకారం పార్టీ కార్యక్రమాలు నిర్వహించినట్లు సుబ్బారెడ్డి తెలిపారు. పార్టీ బీఫారం ఇచ్చేవరకు వేచి చూద్దామని, ఎవరూ ు నిరుత్సాహం చెందవద్దని సుబ్బారెడ్డి కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు చిన్నసుంకయ్య, ఎర్రగుంట్లపల్లి వెంకటేశ్వరరెడ్డ, అంకిరెడ్డి, సుదర్శన్, ఎస్ మధు పాల్గొన్నారు.

వైసీపీ ఓటమి ఖాయం: కాంగ్రెస్

డోన్(రూరల్), మార్చి 20: ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలు విసిగిపోయారని, సాధారణ ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తథ్యమని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మద్దిలేటి మాట్లాడుతూ గురువారం ఉదయం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి నంద్యాల కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులు లక్ష్మీనరసింహ యాదవ్ హాజరవుతారన్నారు. నియోజకవర్గ కార్యకర్తలు ఈ సమావేశంలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జనార్దన్ యాదవ్, మహేంద్ర నాయుడు, మల్లికార్జున, వడ్డె రాజశేఖర్, శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత వైద్యపరీక్షలు

బేతంచెర్ల, మార్చి 20: మండలంలోని అయ్యలచెరువు ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యపరీక్షల సామాజిక ఆరోగ్య కేంద్రం దంత వైద్యులు డా.వెంకటేశ్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రపంచ నోటి శుభ్రత సంరక్షణ దినం సందర్భంగా విద్యార్థులకు ఉచిత దంత వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో విజయలక్ష్మి, ఆశాలు మల్లేశ్వరి, రూతమ్మ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కోట్ల చొరవతో సమస్య పరిష్కారం

డోన్(రూరల్), మార్చి 20: కేంద్ర మాజీమంత్రి, డోన్ టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి చొరవతోనే తమ గ్రామ రైల్వేగేట్ల సమస్య పరిష్కారమైందని వెంకటనాయునిపల్లె గ్రామ టీడీపీ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన కార్యాలయంలో గ్రామస్థులతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామ ప్రధాన రోడ్డులో ఉన్న రైల్వేగేట్ల అండర్‌పాస్ బ్రిడ్జి సమస్యను కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రూ.2 కోట్ల నిధులను కోట్ల ఇప్పించడం హర్షణీయమన్నారు. వీటి వల్ల అండర్‌పాస్ రైల్వేబ్రిడ్జి వెడల్పు విస్తీర్ణం పెరిగి వెంకటనాయునిపల్లె గ్రామాల మీదుగా తిరిగే వాహనదారులకు, రైతులకు, ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా మారుతుందన్నారు. వెంకటనాయునిపల్లె రైల్వేగేట్ అండర్‌బ్రిడ్జి సింగల్ లైన్ పనులపట్ల వ్యక్తమైన అభ్యంతరాలను దృష్టిలో ఉంచుకుని అండర్‌బ్రిడ్జి డబుల్ లైన్ పనులకు కోట్ల ప్రత్యేక ప్రత్యేక దృష్టి సారించి నిధులు తెప్పించి సమస్యను పరిష్కరించడం ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

ఘనంగా పెద్దమ్మ జాతర



పెద్దమ్మకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 20: మండలంలోని టంగుటూరు పెద్దమ్మ జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయబద్దంగా పెద్దమ్మను గ్రామ నడిబొడ్డున కూర్చో బెట్టారు. వివిధ గ్రామాల నుంచి వేలాది మంది జాతరలో పాల్గొన్నారు. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి పెద్దమ్మ జాతరలో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, వెంకటసుబ్బయ్య బీసీకి ఘన స్వాగతం పలికారు. బీసీ టంగుటూరు పెద్దమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

రుద్రవరం, మార్చి 20: మండలంలోని నరసాపురం పది పరీక్ష కేంద్రాన్ని డిప్యూటీ డీఈవో మహబూబ్‌బేగ్ బుధవారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులు రాస్తున్న ఇంగ్లీషు పరీక్ష సరళిని వారు పరిశీలించారు. చీఫ్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు సుబ్బరాయుడు, నళిని ఉన్నారు.

● రుద్రవరంలోని పది పరీక్ష కేంద్రాన్ని తహసీల్దారు మురళీ మోహన్ తనిఖీచేశారు. విద్యార్థులు రాస్తున్న పరీక్ష సరళిని పరిశీలించారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని బాలుర, బాలికల, సెయింట్ ఆన్స్ పాఠశాలలో జరుగుతున్న పదోతరగతి పరీక్ష కేంద్రాలను నంద్యాల జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ శంకరప్రసాద్ తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. .

కలుగొట్లలో గ్రామసభ

కోవెలకుంట్ల, మార్చి 20: మండలంలోని కలుగొట్ల గ్రామంలో రేవనూరు ఎస్సై రాంమోహన్ రెడ్డి గ్రామసభ నిర్వహించారు. బుధవారం గ్రామంలోని ప్రజలతో ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతిఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

శిరివెళ్ల, మార్చి 20: శిరివెళ్లలోని ముబారక్ పేటకు చెందిన టీడీపీ నాయకుడు పఠాన్ షంషీర్ ఖాన్ మృతి చెందడంతో ఆ పార్టీ నాయకుడు భార్గవ్‌రామ్ నాయుడు బుధవారం సంతాపం వ్యక్తం చేశారు. షంషీర్ ఖాన్ మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ సర్పంచ్ బీసీ ఖాజా హుసేన్, ముస్లిం మైనార్టీ నాయకులు బీసీ ఫిదా హుసేన్, బీఎండీ రఫి, అబూబకర్ సిద్ధిఖ్ తదితరులు షంషీర్ ఖాన్ మృతదేహానికి నివాళి అర్పించారు.

'ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు'

రుద్రవరం, మార్చి 20: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎన్‌సీసీ అధికారి రామచంద్ర హెచ్చరించారు. మండలంలోని నరసాపురం, ఆలమూరు గ్రామాల్లో బుధవారం ఆయన సందర్శించారు. నాయకుల విగ్రహాలకు ముసుగులు పరిశీలించారు. గ్రామాల్లో పార్టీల జెండాలు, బ్యానర్లు ఫ్లెక్సీలు ప్రజాప్రతినిధుల ఫొటోలు ఎక్కడ ఉండకూడదని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి పాములేటి ఉన్నారు.

ఓటు నమోదుకు ఆన్‌లైన్ దరఖాస్తులు

చాగలమర్రి, మార్చి 20: 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కుకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తహసీల్దార్ రమణమ్మ తెలిపారు. ఓటర్ల తుది జాబితా ప్రకటించే వరకు ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవచ్చని అన్నారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు కొత్తగా ఓటరు నమోదు చేసుకోవచ్చని సూచించారు.

'ఓటు హక్కును వినియోగించుకోవాలి'



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ చంద్రబాబు

రుద్రవరం, మార్చి 20 ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ చంద్రబాబు సూచించారు. బుధవారం రాత్రి కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులతో రుద్రవరం వీధుల్లో కవాతు నిర్వహించారు. ప్రధాన కూడలిలో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి, బీఎస్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు'

శిరివెళ్ల, మార్చి 20: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అమలులో ఉన్న ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ కులశేఖర్ హెచ్చరించారు. శిరివెళ్లలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి, గ్రామ రెవెన్యూ అధికారులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ వాణిజ్య స్థలాల్లో ఎన్నికల హోర్డింగులు, ప్రకటనలు, బ్యానర్లు లేకుండా చూడాలన్నారు. రాజకీయ పార్టీల ప్రచారాల్లో వలంటీర్లు, ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నట్లు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫణి రాజకుమారి, ఈవోపీఆర్డీ నాగేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్, ఆర్‌ఐ సుచరిత తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు సురక్షితం'

దొర్నిపాడు, మార్చి 20: ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు సురక్షితమని వైద్యాధికారి నాగేంద్ర అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గర్భిణీ మహిళలు ప్రభుత్వ వైద్యశాలలను సంప్రదించి తగిన చికిత్సలు పొందాలని సూచించారు. ప్రైవేటు వైద్యశాలలకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలల్లో ఉత్తమ వైద్యం అందుతోందన్నారు. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికారం తీసుకుంటూ వైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. ప్రతి నెల క్రమం తప్పకుండా వైద్యశాలను సంప్రదించి చికిత్సలు పొందాలన్నారు. బుధవారం బుర్రారెడ్డిపల్లె గ్రామానికి చెందిన గర్భిని ప్రసవం జరిగిందని, తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. స్టాఫ్ నర్స్ దానమ్మ, ఎఫ్ఎన్‌వో మానస ఉన్నారు.

'టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి'

ఉయ్యాలవాడ, మార్చి 20: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం పెద్దయ్మనూరు గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి టీడీపీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారెంటీపై ప్రజలకు వివరించారు. గ్రామ వైసీపీ సర్పంచ్ బండి మరియమ్మతో పాటు మరో 15 కుటుంబాలు టీడీపీలో చేరాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బోరెడ్డి శేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ కూడాల నారాయణరెడ్డి, మండల నాయకులు కర్రా చిన్నసారెడ్డి, విజయప్రతాప్‌రెడ్డి, రాజేశ్వరరెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పండ్ల తోటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి'

చాగలమర్రి, మార్చి 20: గ్రామాల్లో పండ్ల తోటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని ఏపీవో నిర్మల సూచించారు. బుధవారం ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు వందశాతం సబ్సిడీతో పండ్ల తోటల పెంపకానికి ఉపాధి నిధులు మంజూరు చేస్తామన్నారు.

అందరికీ అందుబాటులో వైద్యసేవలు

కొలిమిగుండ్ల, మార్చి 20: కొలిమిగుండ్ల ప్రభుత్వ వైద్యశాలలో అందరికీ వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ హరిచరణ్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో ల్యాబ్‌లో విలువైన పరికరాలు, కుక్కకాటుకు ఆంటీరేబీస్ పాముకాటుకు ఆంటీవీనమ్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

పాఠశాల తనిఖీ

చాగలమర్రి, మార్చి 20: చాగలమర్రి గ్రామంలోని పాత బస్టాండు సమీపంలోగల ప్రాథమిక పాఠశాలను ఎంఈవో అనూరాధ బుధవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.హెచ్‌ఎం మౌళాలి, సీఆర్పీ అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.